క్లుప్తంగా

నేడు అయోధ్య రామాలయం ప్రారంభోత్సవం

హాజరు కానున్న ప్రముఖులు



వేమూరు: చుండూరు మండలంలోని నడిగడ్డ పాలెం ఎస్సీ కాలనీలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆర్థిక సహకారంతో చేపట్టిన అయోధ్య రామాలయం ప్రారంభోత్సవం బుధవారం జరగనుంది. ఉదయం 11-14 గంటలకు శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి చేతుల మీదుగా ఆలయంలో ఉత్సవ మూర్తుల ప్రతిష్ఠ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని అయోధ్య రామాలయం నిర్మాణ అభివృద్ధి కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున, నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు పాల్గొంటారని చెప్పారు.

ఘనంగా వాసవీమాత వార్షికోత్సవం

చెరుకుపల్లి: శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి 13వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి 108 బిందెలతో జలాభిషేకం, కుంకుమపూజ, పట్టు వస్త్రధారణతో పాటు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం లలితా పారాయణం, విష్ణు సహస్ర నామ పారాయణం గావించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు యెండూరి మధుసూదనరావు, కార్యదర్శి చందలూరి గోపి, కోశాధికారి యెండూరి రాఘవేంద్రరావు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెరుకుపల్లి డిప్యూటీ తహసీల్దార్‌గా శాంతలక్ష్మి



చెరుకుపల్లి: చెరుకుపల్లి డిప్యూటీ తహసీల్దారుగా ఏ శాంత లక్ష్మి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం నుంచి బదిలీపై చెరుకుపల్లి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన నిరంజన్ బాబు బాపట్ల జిల్లా కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లారు.

వేడుకగా బాబా ఆలయ వార్షికోత్సవం

బాపట్ల: బాపట్ల పట్టణంలోని చీలురోడ్డు సెంటర్‌లో వేంచేసి యున్న షిరిడీ సాయిబాబా దేవాలయంలో 28వ వార్షికోత్సవం సందర్భంగా అఖండ దీపస్థాపన ఉత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. గుండ్రెడ్డి శివ, అనురాధ దంపతులు ఈ ప్రత్యేక దీపస్థాపనలో పాల్గొన్నారు. భక్తులు భారీగా పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల షిరిడీ సాయిబాబా ఆలయ సేవా సమితి అధ్యక్షులు కె. రాజ్యలక్ష్మీ, సెక్రటరీ ఉప్పాల వీరయ్య, బలగాని బాలకృష్ణుడు, ఉడ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

16న సూర్య నమస్కారాల పోటీలు

తెనాలి: రథసప్తమిని పురస్కరించుకుని ఈ నెల 16వ తేదీన యోగ భారతి, క్రీడా భారతి సంయుక్త ఆధ్వర్యంలో బాలబాలికలకు నాలుగు కేటగిరిల్లో సూర్య నమస్కారాల పోటీలు నిర్వహించనున్నారు. కన్వీనర్ ప్రభల మల్లికార్జున శర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోసురోడ్డులోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థాన ఆవరణలో ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు తమ తమ పాఠశాలల ద్వారా పోటీల్లో పాల్గొనవచ్చని చెప్పారు. కార్యక్రమాన్ని 10 నిమిషాల ముందు తమ పేర్లు నమోదు చేసుకుని పాఠశాల యూనీఫాంతోనే పోటీల్లో పాల్గొన వచ్చని తెలిపారు. వివరములకు 9490875076, 9985423196 సంప్రదించాలని కోరారు.

మహాప్రస్థాన సేవాసమితికి రూ.లక్ష వితరణ



తెనాలి: పట్టణానికి చెందిన శాఖమూరి శ్రీనివాసరావు, ఆయన కుమార్తె కొడాలి నగరాజ కుమారి తెనాలి మహాప్రస్థాన సేవా సమితికి రూ.లక్ష విరాళంగా అందజేశారు. తన తల్లిదండ్రులు శాఖమూరి రాఘవయ్య-భాగ్యశ్రీ జ్ఞాపకార్థం మహాప్రస్థానం అభివృద్ధికి ఈ వితరణను చేపట్టినట్టు శ్రీనివాసరావు తెలిపారు. సేవాసమితి అధ్యక్షుడు డాకా సాంబిరెడ్డి, కార్యదర్శి జెట్టి శివ రామకృష్ణప్రసాద్, కోశాధికారి తుమ్మల బాపయ్య చౌదరికి మంగళవారం రూ.లక్ష చెక్కును ఆయన అందజేశారు. కన్నెగంటి బాపనయ్య, మండవ ధనుంజయ రావు, రావెళ్ల వెంకటాద్రి, కొడాలి అప్పారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలనలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్



ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరు తెన్నులను అడిగి తెలుసుకుంటున్న డాక్టర్ ఈవూరి

రేపల్లె రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. 'సిద్ధం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని మైనేనివారిపాలెం గ్రామంలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. జగనన్న సంక్షేమ పాలనకు గ్రామీణ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు ప్రతి ఒక్కరూ ఆకర్షితులవుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరూ లక్షల రూపాయలలో లబ్ధి పొంది ఆర్థిక భద్రత పొందుతున్నారన్నారు. పేదవారి ఆర్థిక ఎదుగుదలే జగనన్న లక్ష్యమన్నారు. గతంలో ఎన్నడూ ఎరుగని విధంగా రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమంతో స్వర్ణ యుగాన్ని తలపిస్తోందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రచారం నిర్వహిస్తూ ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలిచి మరోమారు పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బండ్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



గౌరీదేవి అలంకారంలో పూజలు అందుకుంటున్న బండ్లమ్మ

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి యున్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్రా శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్య నిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారి దేవాలయంలో ప్రతి మంగళవారం వివాహం కాని ఆడవారికి శీఘ్రంగా వివాహం జరుగుట కొరకు హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పసుపు కొమ్ములతో నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఈ సందర్భంగా బండ్లమ్మ వారిని మహాగౌరీ దేవిగా అలంకరించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు జరిపించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష శిబిరాలను వినియోగించుకోండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసమూర్తి

చెరుకుపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి పేదవాడికి మెరుగైన వైద్య సేవలు అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య సేవలు అందించటం జరుగుతుందని ఎంపీడీవో శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. మండలంలోని గూడవల్లి సచివాలయం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని స్థానిక ప్రజా ప్రతినిధులు వైద్యాధికారులతో కలసి ఆయన ప్రారంభించారు. ప్రతి గ్రామంలో ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యటిస్తూ అనారోగ్యంతో ఉన్నవారిని గుర్తించి వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందివ్వటం జరుగుతుందన్నారు. శిబిరానికి హాజరైన రోగులకు వైద్యాధికారులు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.

సమాజ సేవలో విద్యార్థులు భాగస్వాములు కావాలి



ఆరోగ్య ఉప కేంద్రం ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న విద్యార్థినిలు

రేపల్లెరూరల్: విద్యార్థులు సమాజ సేవా కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని ఐఆర్‌ఈఎఫ్ డైరెక్టర్ బిషప్ డాక్టర్ ఇమ్మానుయేలు రెబ్బా అన్నారు. ఐఆర్‌ఈఎఫ్ విద్యాసంస్థలు, ఆర్‌సీ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-2 విభాగం ఆధ్వర్యంలో మండలంలోని ఉప్పూడి గ్రామంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు మంగళవారం ఐదవ రోజుతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని భావించి గ్రామాల అభివృద్ధిలో భాగంగా మండలంలోని పలు గ్రామీణ ప్రాంతాలలో తమ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. భవిష్యత్‌లోనూ ఈ సేవా కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొని తమ వంతు సేవలను సమాజానికి అందించాలన్నారు. అనంతరం గ్రామంలో ఆరోగ్య కేంద్రం, సచివాలయాల సమీపంలో పిచ్చిమొక్కలు తొలగించి పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జాషువా రెబ్బా, ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆవుల వంశీకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



బాధితులకు నగదు అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు నాగదేవిక, కౌన్సిలర్ దుబాయ్‌బాబు

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో ఈ నెల 10న జరిగిన అగ్నిప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు కుటుంబాలకు మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆదేశాల మేరకు పార్టీ నాయకులు బాధితులైన షేక్ మాగ్బూల్ కుటుంబానికి రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఎంపీటీసీ సభ్యులు నాగదేవిక, కాలిశెట్టి ఫణీకుమార్, మున్సిపల్ కౌన్సిలర్ షేక్ దుబాయ్ బాబు నగదు అందజేశారు. ఇళ్లు కోల్పోయిన వారికి పార్టీ అండగా ఉంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్లవరపు బుల్లయ్య, ప్రసాదం సురేష్, వీరమల్లు కార్తికేయ, అక్కిదాసు కిరణ్ కుమార్, షేక్ ఖాజావలి, కోలంటి దాసు, షేక్ అజ్జర్, భరత్, వీఆర్వో సురేష్, అమీర్‌బాషా, ఉన్నం రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఎన్‌ఆర్‌ఐ ప్రభజనం



మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులతో సీఈవో ఉమామహేశ్వరరావు

తెనాలిఅర్బన్: జెఈఈ మెయిన్స్ ఫేజ్-1 ఫలితాల్లో తెనాలిలోని ఎన్‌ఆర్‌ఐ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని ఎన్‌ఆర్‌ఐ విద్యాసంస్థల సీఈవో ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని ఎన్‌ఆర్‌ఐ జూనియర్ కళాశాలలో బుధవారం మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు జె.జగన్నాథ సూరి 99.85, ఎం.రోహిత్ 99.81 మార్కులు సాధించినట్లు చెప్పారు. అలాగే 44 మంది 90 శాతం మార్కులు సాధించారని చెప్పారు. త్వరలో జరగనున్న జెఈఈ అడ్వాన్స్‌లో కూడా తమ విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జోనల్ ప్రిన్సిపల్ శ్రీమన్నారాయణ, ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి, అధ్యాపకులు కిషోర్, స్కూల్ డీన్ కిషోర్‌బాబు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లాజర్స్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కొక్కిలగడ్డ సాహితి

చేబ్రోలు: ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో గ్రామాభివృద్ధికి కృషి చేయాలని చేబ్రోలు మండల పరిషత్ అధ్యక్షురాలు కొక్కిలగడ్డ సాహితి సూచించారు. చేబ్రోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఎంపీడీవో కె జ్యోతి, జీడీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, వీఆర్వోలు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా మాతా రమాబాయి వర్ధంతి



బాపట్ల: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి మాతా రమాబాయి 126వ జయంతి సందర్భంగా అంబేడ్కర్ భవనంలో మంగళవారం 'మాల పేరంటాల పెళ్లి నలుగు' పాటల పోటీలను మంగళవారం నిర్వహించారు. మాల మహాసభ, పీపుల్స్ రిపబ్లికన్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలలో 14 టీములు పాల్గొన్నాయి. పోటీల్లో పాల్గొన్న ప్రతి టీంకు ప్రోత్సాహకంగా రూ.1,500లు నగదు అందజేశారు. గణపవరం, ప్యార్‌లీపాడు, మూలపాలెం, చింతవారిపాలెం, నరసాయపాలెం, హైదర్‌పేటకు చెందిన వారు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మాల మహాసభ వ్యవస్థాపకులు, పీపుల్స్ రిపబ్లికన్ పార్టీ అధ్యక్షులు మల్లెల వెంకటరావు, జి. లజపతిరాయ్, ఎంద్రపాటి అశోక్, నక్క భాను, దగ్గు మల్లి కిరణ్ కుమార్, శ్రీమతి అడే బుజ్జి, గొర్రుముచ్చు వందనం, చల్లపల్లి కోటేశ్వరరావు, ఎర్ర కోటయ్య, గుదే రాజారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం

కర్లపాలెం: మండలంలోని దమ్మనవారిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను బుధవారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు మంగళవారం తెలిపారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ప్రారంభోత్సవానికి మండల పరిధిలోని అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

పృథ్వీశ్వర స్వామి ఆలయంలో కొనసాగుతున్న పూజలు

చెరుకుపల్లి: కనగాల గ్రామంలో వేంచేసి యున్న శ్రీగంగా పార్వతీ సమేత శ్రీ పృథ్వీశ్వర స్వామి దేవస్థాన సన్నిధిలో ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా రెండో రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శైవాగమ సహస్ర శతాధిక ప్రతిష్ఠాచార్య, ఆంధ్ర ప్రదేశ్ అర్చక ఆగమ ఎగ్జామినర్ బ్రహ్మశ్రీ స్వర్ణ వెంకట శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ఆలయ సన్నిధిలో ధ్వజస్తంభ ప్రతిష్ఠకు హోమగుండం ఏర్పాటు చేశారు. వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు జనతారావు, పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ గంగానమ్మపేటలోని ప్రభుత్వ మద్యం దుకాణం నుండి గురవయ్య కాలనీకి చెందిన బాలు మంగళవారం ఎనిమిది క్వార్టరు సీసాలు కొనుగోలు చేసి వెళుతుండగా బస్టాండ్‌సమీపంలోని స్థూపం సెంటరు వద్ద పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాడు. సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు.

భవన నిర్మాణాలకు నాణ్యమైన సిమెంట్ వినియోగం తప్పనిసరి



డీలర్‌కు బీమా బాండ్ అందజేస్తున్న అసిస్టెంట్ మేనేజర్ పూల సురేష్

పెదకాకాని: భవన నిర్మాణాలు శాశ్వతమైనవని, నిర్మాణం కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తయారు చేయబడిన నాణ్యమైన సిమెంట్ ఎంచుకోవాలని భారతి సిమెంట్స్ అసిస్టెంట్ మేనేజర్(మార్కెటింగ్) పూల సురేష్, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఎస్ భవానీశంకర్ సూచించారు. నంబూరులో మంగళవారం రాత్రి చార్మి ఎంటర్‌ప్రైజెస్ సహకారంతో భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ మేస్త్రీలు, కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ అధునాతన పరిజ్ఞానంతో భారతి సిమెంట్ తయారవుతుందన్నారు. కట్టడాలు పూర్తి నాణ్యతతో దీర్ఘకాలం మన్నేందుకు దోహదపడుతుందన్నారు. సిమెంట్ తయారీకి నా ణ్యమైన ముడి పదార్థాలను తమ కంపెనీ ఎంచు కుంటుందని తెలిపారు. భవానీ శంకర్ మాట్లాడుతూ భారతీ సిమెంట్ వినియోగించి కాంక్రీటుతో వేసిన శ్లాబులను ఏడు రోజుల అనంతరం తమ కంపెనీ ప్రతినిధులు వచ్చి నాణ్యతా పరీక్షలు చేసి భారతి సిమెంట్ నాణ్యతను భవన నిర్మాణ మేస్త్రీ లు, యజమానులకు వివరిస్తామన్నారు. మేస్త్రీల సందేహాలను నివృత్తి చేశారు. సదస్సుకు హాజరైన మేస్త్రీలు, కార్మికులకు రూ.లక్ష చొప్పున బీమా సదుపాయం కల్పించి బాండ్లను అందజేశారు.

ఆరోగ్య సురక్షతో ఇంటి ముంగిటకు వైద్యసేవలు

నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు



ఆరోగ్య సురక్ష ప్రారంభ సమావేశంలో మాట్లాడుతున్న వరికూటి

కూచిపూడి(వేమూరు): ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా ఇంటి ముందుకు వైద్య సేవలను తీసుకెళ్లడం జరిగిందని నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. అమర్తలూరు మండలంలోని పెదపూడి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంగళ వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ద్వారా ప్రత్యేకమైన వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. వైద్యులు పెదపూడి గ్రామంలో ప్రతి ఇంటి ముందుకు వెళ్లి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాపర్ల నరేంద్ర, గ్రామ సర్పంచ్ పెదపూడి ఆనంద్, ఎంపీటీసీ సభ్యుడు తెనాలి పవన్, ఎంపీడీవో స్వరూప రాణి, వైద్యులు మౌనిక, ఏసుబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గణపతి స్వామి వారికి అన్నాభిషేకం



అన్నాభిషేకం అనంతరం దర్శనమిచ్చిన సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామివారు

వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో కొలువైన ప్రథమ పూజాధిపతి సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామివారి బ్రహ్మోత్సవాలు నేత్రానందంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వార్లకు మహన్యాస పూర్వక ఏకాదశ వార పంచామృత అభిషేకాలతో పాటు అన్నాభిషేకం నిర్వహించారు. రాత్రి స్వామి వారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్సవాలలో ప్రధాన ఘట్టమైన రథోత్సవం ఈనెల 15న జరుగనున్నది. దేవస్థాన ధర్మకర్త, విశ్రాంత హైకోర్టు న్యాయవాది తాడికొండ శేషగిరి రావు ఆధ్వర్యంలో పంచాహ్నిక దీక్షతో ఈ బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. స్వామి వారి కల్యాణ మహోత్సవాలే వెల్లటూరు తిరునాళ్లగా ప్రసిద్ధి గాంచాయి. ఈ తిరునాళ్ల ప్రారంభమయ్యాకనే చుట్టుపక్కల ప్రాంతాలలో తిరునాళ్ల ఉత్సవాలు జరుగుతాయి. దేవాలయ ప్రధాన అర్చకులు క్రోవి శ్రీరామచంద్రమూర్తి, తమిరిశ మారుతి, క్రోవి రామకృష్ణల ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఆదిలక్ష్మి కామేశ్వరి అమ్మవారికి కుంకుమార్చన, సామూహిక సువాసినీ పూజ, రాత్రి స్వామి వారి ఊయల సేవ అనంతరం శేషవాహనంపై గ్రామోత్సవం నిర్వహించనున్నారు. గురువారం లక్ష్మీ గణపతి హోమం, రాత్రి స్వామి వారి దివ్యరథోత్సవం, శుక్రవారం వసంతోత్సవం, శ్రీదేవి భూదేవి సమేత ఆదిశేషాచల స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వివరించారు.

కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన



క్యాలెండర్లను అందజేస్తున్న బీజేపీ నాయకులు

చెరుకుపల్లి: దేశాన్ని పేదరికం రహిత దేశంగా తీర్చి దిద్దేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారని బీజేపీ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు ఉద్రకుండ శివరావు పేర్కొన్నారు. మండల పరిధిలోని నడింపల్లి, రాజవోలు గ్రామాల్లో వికసిస్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా దేశంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి ఇంటింటికీ నరేంద్ర మోదీ పథకాలతో కూడిన క్యాలెండర్‌ను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాంపల్లి జగన్నాథ శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులను అరికట్టాలి

బీజేఆర్ కమిటీ డిమాండ్



డీఎస్పీ జనార్థనరావుకు వినతిపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

తెనాలిరూరల్: దళితులపై అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులు చేస్తున్న దాడులను పోలీసులు అరికట్టాలని బాబు జగ్జీవన్‌రామ్(బీజేఆర్) కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఇటీవల తాడేపల్లి మండలం చిర్రావూరులోని దళిత రేషన్ డీలరుపై అదే గ్రామానికి చెందిన అగ్రవర్ణానికి చెందిన వారు దాడికి పాల్పడ్డారు. ఈ కేసు విచారణాధికారిగా తెనాలి డీఎస్పీ బి. జనార్థనరావును ఉన్నతాధికారులు నియమించారు. ఈ నేపథ్యంలో బీజేఆర్ కమిటీ సభ్యులు మంగళవారం డీఎస్పీని ఆయన కార్యాలయంలో కలిశారు. ఇటీవలి కాలంలో దళితులపై జరుగుతున్న దాడులను డీఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. కేసును నిష్పక్షపాతంగా విచారించి బాధితుడికి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని డీఎస్పీని కోరారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు మేకల సురేష్ మాట్లాడుతూ అట్రాసిటీ కేసులో ప్రభుత్వం తరపున అందే సాయం బాధితుడికి త్వరగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరుగకుండ పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. ఆత్తోట శ్యామ్, ఆత్తోట శరత్, కటెవరపు దేవన్న అత్తోట చంటి, కొమ్ము రాయల్, సీనియర్ న్యాయవాది ఇందుపల్లి రాజారామ్, నలుకుర్తి రమేష్, జి. రవి తదితరులు డీఎస్పీని కలిసిన వారిలో ఉన్నారు.

పంట నమోదుకు ఈకేవైసీ తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మ లీల

పొన్నూరు: వ్యవసాయ సంబంధిత రుణాలు పొందేందుకు రైతులు పంట నమోదుతో పాటు ఈకేవైసీ తప్పకుండా చేయించుకోవాలని ఎంపీపీ భవనం పద్మలీల పేర్కొన్నారు. పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం మంగళవారం నిర్వహించారు. పొన్నూరు సహాయ వ్యవసాయ సంచాలకులు వి.రామకోటేశ్వరి మాట్లాడుతూ రబీ సీజన్‌కు ఈ నెల 15తో పంట నమోదు ప్రక్రియ ముగియనుందని రైతులు త్వరపడాలని సూచించారు. పంట నమోదు వివరాలు సామాజిక తనిఖీ కోసం రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు బొద్దులూరి రంగారావు, మండల చైర్మన్ ఎల్.పిచ్చిరెడ్డి, వ్యవసాయ అధికారి వెంకటరామయ్య, రైతులు నన్నపనేని వెంకటసుబ్బారావు, సుంకర హనుమారెడ్డి, పుప్పాల శివ శంకరరావు పాల్గొన్నారు.

यूनियन बैंक Union Bank

పెరవలి బ్రాంచి
పెరవలి గ్రామం, వేమూరు మండలం,
బాపట్ల జిల్లా-522251, ఫోన్: 8356804151.

బంగారు నగల వేలము నోటీసు

... తేది.21-02-2024 ... 1.00 గంటలకు ... రూ.10,000/-ల ... 1.00 గంటలోపు ...

క్ర.సం.	ఖాతా నెంబరు	ఖాతాదారుని పేరు	మొత్తం తూకం (గ్రాముల్లో)
1	04161[illegible]763	[illegible]	15.00
2	04161[illegible]274	[illegible]	46.00

తేది:13-02-2024, ప్రదేశం: పెరవలి   సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పెరవలి బ్రాంచి, బాపట్ల జిల్లా.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

బాపట్ల డివిజన్

95055 07638 (బాపట్ల)
90102 23706 (వేమూరు, రేపల్లె)
Office mail : sakshigntadvt@gmail.com